

# వ్యస్తజీవులు

కథానిక

జీవిత సోపానాలను సగంవరకూ అధిరోహించి వెనక్కు తిరిగి చూచాను. కళ్ళు గిర్రున తిరిగాయి. గుండె వేగంగా కొట్టుకుంది క్షణంసేపు భయం వేసి! ఈ నాడు జీవితాంతరాళంలో నిలబడి తలుచుకొంటే 'అన్ని మెట్లు ఎలా ఎక్కగలిగానా?' అని ఆశ్చర్యం వేస్తోంది. అప్రతిహత మృత్యుముఖంలోంచి తప్పించుకొంటూ మానవుడు ఎంతచురుగ్గా జీవిస్తున్నాడో ఆ నిమిషాన నాకు అర్థమయింది! కానీ గతాన్ని చూస్తున్నకొద్దీ అంధకారబంధురంగావుంది. రహదారి నిస్సారంగా-ఎడారిలావుంది! "ఇంతకాలం ఇంతశూన్యంగా జీవితం ఎలా గడపగలిగాను?" అని నన్ను నేను ప్రశ్నించుకుంటే నేనెంత గుండెధైర్యం కలవాణ్ణో నాకా సమయాన జ్ఞేయమైంది.

ఆ రోజునే బాల్యమిత్రుడు చిరకాలానికి తటస్థించాడు. ఒక్కసారి జీవిత సింహావలోకనం జరిగింది. బంధుమిత్రుల్ని అనుకరిస్తూ, సంఘంలో స్థానంసంపాదించి గౌరవంగా బ్రతుకుతున్న రాఘవరావుకీ, సంఘానికి లెక్కచెయ్యకుండా - దానికి దూరంగావుండి జీవితాన్ని దాని ఇష్టం వచ్చినట్లు-కళ్లెంలేని గుర్రంలా పోనిచ్చిన నాకూ ఆలోచించుకుంటే చివరికి మిగిలింది ఒక్కటే: అవి బాల్యస్మృతులు. అంతకంటె ఇంకేమీ మిగల్లేదు.

ఒకనాడు రాఘవరావు సూటువేసుకొని సిగరెట్టుపీలుస్తూ ఝల్సాగా తిరుగుతున్న రోజుల్లో "ఏమో! నీ ఉద్దేశాన్ని నేను హర్షించలేకుండా వున్నాను. జీవితాన్ని దానిష్టంవచ్చినట్లు పోనిస్తే దాంట్లో అర్థంలేదనుకుంటాను!" అన్నాడు.

"అందరికిమల్లేనే పెళ్ళిచేసుకుంటావు, పిల్లల్ని కంటావు ముసలివాడివయిపోతావు... తరువాత... ఎప్పుడో-ఎక్కడో-ఎందుకో అలా పండిపోయిన పచ్చనాకు చెట్టుమీదనుంచి రాలిపోయినట్లు రాలిపోతావు-మామూలే! . ఏమిటి నువ్వుసాధించేది?" అన్నాను నేను.

"నువ్వా? పెళ్ళిచేసుకోవు, ఇష్టంవచ్చినట్లుగా వుంటావు. చివరకి? చివరిక్షణంలో ప్రాణాలు పోయేటప్పుడు గొంతులో తులసినీళ్లుకూడా పోసే దిక్కులేక అలమటించి ఎవరికీ తెలీకుండానే నిక్రృష్టపుచావు చస్తావు." నా వాదానికి కోపం వచ్చిందిగాబోలు ఉద్వేగంతో అన్నాడు.

"చచ్చాక ఏమైతే ఏమిటి?"

"ఇప్పుడు వాదించుకోవడం అనవసరం! ఇప్పుడు జీవితరహదారి అనుసరిస్తూ విడిపోయినా వ్యక్తులం మాత్రం కలుసుకోకుండా వుండం. అప్పుడు ఆలోచిద్దాం; అనుభవం సంపాదించి వుంటాం గనక." అక్కడితో తెగిపోయినవిషయం మళ్ళా ఈ నాడు మొదలైంది.

"నువ్వేం సాధించావు?" అని అడిగాను.

సమాధానం శూన్యం - గంభీరమైన శూన్యమే మిగిలిపోయింది చివరికి.

"మరినువ్వో?" అదే ప్రశ్న తిరిగి అడిగాడు మిత్రుడు. దానికీ అదే సమాధానం. జీవితంలో అన్నీ ప్రశ్నలే మిగిలాయి.

"తిరునగర్"

మిత్రుడు దీర్ఘంగా నిట్టూర్చి "నీకేవిటి? దిగుల్లేదు. నాకుచూడు. జీవితంలో అన్నీ సమస్యలే! బ్రతుకు మహా యాతనగావుంది. కాని ఇంతయాతనావహమైన జీవితాన్ని అనుభవిస్తున్నా ఇవన్నీ ఎందుకు ఎవరికోసం చేస్తున్నానో అర్థంకావడంలేదు. ఒకమ్మాయికి పెళ్ళి చేశాను. ఇంకో అమ్మాయి వుంది. ఇద్దర్లో ఒకడు ఇంజనీరింగు చదువుతున్నాడు. ఇంకో కతను బ్యాంకిలో ఎకౌంటెంటు! వాళ్ళకి పెళ్ళిళ్లు చెయ్యాలి! మొదటమ్మాయికి ఆరో నెలట. తీసుకు రావాలి! అదో ఖర్చు. ఏం చెప్పమంటావు మ్చ్! ఏమిటో లే!" అన్నాడు జీవితంమీద తీరని విసుగేసి పోయింది గాబోలు పాపం అందుకే అంత నిస్పృహ!

లేనిదానికోసం ఏడవడం మానవత్వానికి సహజగుణమైపోయింది.

"సంసారం పిల్లాజల్లా వాళ్ళకు తనమీదవుండే అభిమానం, ఇంతకంటె మనిషికి కావలసిందేవిటి?" అని నాలో పొరుగింటి పుల్లకూరమీద రుచి! కానీ... కానీ ఎందుకివన్నీను?

ఈ ప్రశ్న రాకుండ వున్నంతవరకూ జీవితం సాఫీగానే సాగిపోతుంది. తాత్విక వాదం మనిషిలో ప్రవేశించేసరికి జీవితంలో ప్రతి చిన్నపనికీ కారణం అడుగుతుంది విలవేసిన మనసు! ఆపని నీకేవిధంగా లాభమో స్వార్థలాభంతో కొలిచి చెప్పమంటుంది దాంతో వైరాగ్యం!

పోనీ రాఘవరావు తన జీవితాన్ని పాపం వ్యర్థంచేసుకున్నాడు అనుకుందాం! నేనో? నేం చేసిందిమాత్రం యేముంది? అతనిలాగ పెళ్ళి చేసుకోలేను. ఉన్న ఆస్తిని నా సుఖంకోసం ఖర్చుచేశాను. రాఘవరావుని ఏ సంకెళ్లు బాధించి ప్రకృతికి బానిసను చేశాయో వాటినన్నిటినీ తెంచుకున్నాను. కానీ .. కానీ నాకేం మిగిలింది?

అనంతమైన ఆవేదన!...

మరి జీవితపు సరైన విధానం ఏమిటి? ఏ విధంగా నడిస్తే జీవితం సౌఖ్యవంతంగా తృప్తిగా వుంటుంది? ఈ విషయం తెలియడానికి జీవితం కావాలి!

మంచంమీద వెల్లకిలా పడుకుని వాసాలు చూస్తూవున్నాను. రాఘవరావుని స్టేషన్ దాకా వెళ్ళి బండెక్కించివచ్చి పడుకున్న దగ్గర్నుంచీ ఆలోచనలు రావడం మొదలుపెట్టాయి. ఇంతలో ఆగేదికాదు గానీ బయట పోస్టుమాన్ వచ్చి కేకలు పెడుతున్నాడు. లేచి వెళ్ళి ఉత్తరం అందుకున్నాను

ఉత్తరం రాజమండ్రినించి నరేంద్రరావు రాశాడు శుభలేఖతోపాటు. తన అన్నకుమార్తె పెళ్ళిట. వీరేశలింగం పంతులుగారి వితంతు శరణాలయంలో ఓ అమ్మాయినిచ్చి చేస్తున్నారట. పెళ్లికి చెయ్యవలసినపనులు చాలా వున్నాయనీ-తనకేమీ తెలియదనీ చూడవలసినవి చాలా వున్నాయి గనక తప్పకుండా రావలసిందనీ రాశాడు.

నాకు ఆశ్చర్యం కలిగింది. నరేంద్రరావుకి అన్నయ్యవున్నాడనీ-అతనికి ఓ కొడుకున్నాడనీ నాకెప్పుడూ తెలీదు. నరేంద్రరావుకీ-నాకూవున్న స్నేహం కొద్దిదేమీ గాదు వెంటనే ప్రయాణమై మిత్రుణ్ణి కలుసుకున్నాను-నా కోసం వెయ్యి కళ్ళతో ఎదురుచూస్తూ కూర్చున్న నరేంద్రరావు అమాంతం కౌగలించుకున్నాడు.

"అసలు నీకో అన్నయ్య వున్నాడని నాకెప్పుడూ చెప్పావు కాదు!" అన్నాను.

"చెపుతా-ఇంటి కెళదాం పద..."అన్నాడు

సాయంత్రం చల్లగాలి మొదలుపెట్టింది.

"అలా గోదావరివడ్డున కూర్చుందాం పద" అన్నాడు కాఫీ త్రాగింతరువాత.

గోదావరి ఒడ్డున కూర్చున్నాం. నరేంద్రరావు తాను చెప్పదలుచుకున్నదంతా రెండునిముషాలు ఆలోచించి సంక్షిప్తరూపానికి తెచ్చుకున్నాడల్లేవుంది.

"ఇదెప్పుడో చిన్ననాటి విషయం. మానవులు క్షణిక ఆవేశాలకు లొంగిపోయి ఎలాటి వజ్రాఘాతాలకు గురౌతారో అన్నయ్య జీవితమే తార్కాణ! మేమప్పుడు కృష్ణాజిల్లాలో ఓ పల్లెటూర్లో వుండేవాళ్ళం. అన్నయ్య పట్నంలో కాలేజీలో చదువుతున్నాడు.

ఓరోజు పేపర్లో అన్నయ్య ఓ క్రిష్టియను అమ్మాయిని వర్ణాంతర వివాహం చేసుకున్న సంఘసంస్కర్తగా ఫోటోతో సహా ప్రకటించారు. నాన్న చూచి నిర్ఘాంతపోయాడు. ఆవాళే

అన్నయ్యదగ్గర్నుంచి నాన్నకు ఉత్తరంవచ్చింది. నాన్నకిదేమీ అర్థంగాక గబగబా పంచె భుజాన వేసుకొని పట్నం బయలుదేరాడు. కాని రెండు రోజుల్లో ఆయనొక్కడే తిరిగొచ్చాడు.

"వాడేడీ?"అంది అమ్మ.

"ఇంకెక్కడివాడు? వాడెప్పుడో మారి పోయాడు. ఆస్తిలో ఒక్క కానీ అయినా రాదని చెప్పినా "ఫరవాలేదులే"అన్నాడు కుర్రకుంక! అసలు వాణ్ణి అంతదూరం పంపడమే వచ్చింది!" అన్నాడు నాన్న.

"అసలు ఎలా చేసుకున్నాడండీ ఆ కిరస్తానీ అమ్మాయిని?"అంది అమ్మ.

"వాడికి కలిగింది కాదే ఇది! వాడి స్నేహితుల్ని కనుక్కుంటే చెప్పారు. వాడూ-వాడి స్నేహితుడూ కలిసి బీచీకి వెళ్ళారుట! అక్కడ ఎవరో ఒకాయన వర్ణాంతర వివాహాల్నిగురించి చెపుతూ యువకులంతా ముందుకువచ్చి వర్ణాంతర వివాహాలు చేసుకోకపోతే సంఘం బాగు పడదు. అటువంటివారెవరేనా వుంటే ముందుకు రండి"అని ఉపన్యాసం చెపుతున్నాడట. మన వాడు ఉద్రేకపడి వెనకనించి "నే చేసుకుంటా" అని గట్టిగా అరిచాడట! అంతలో ఓ క్రిష్టియను బడిపంతులు లేచి "బాబూ బడిపంతులు ఉద్యోగంతో పిల్లలకి ఈడువచ్చినా పెళ్ళిచేయలేక చస్తున్నాను. నా కూతుర్నిస్తాను" అన్నాడట. ఉపన్యాసం చెప్పినతనే అన్ని విషయాలూ మాట్లాడి మనవాడ్ని ఒప్పించాడట! అంతే జరిగి పోయింది."

"అయ్యో!"అంది అమ్మ కుప్పగా కూలి పోతూ.

"వాడికా బాధ కించిత్తయినా వున్నట్టు లేదు పైగా గర్వంగా చూచాడు నావంక! నేను ఆనక్కో చిల్లిగవ్వ ఇవ్వకపోయినా లెక్కలేదట"అన్నాడు నాన్న అన్నయ్యనిగురించి చెపుతూ.

"ఒక్కసారి వెళ్ళి చూచివస్తానండీ!" అంది అమ్మ.

ప్రాణంపోయినా వీల్లేదన్నాడు నాన్న. ఇంట్లో ఎవరైనాసరే వాడింట్లో మంచినీళ్లు త్రాగినా-తన ఇంట్లో అడుగుపెట్టడానికి వీల్లేదని శాసించాడు. ఆగ్రహంవస్తే నాన్న ఎంతగా మారి పోతాడో నాకాక్షణాన అర్థమయింది. ఆయన ఎవర్నీ తేలిగ్గా క్షమించలేడు.

అన్నయ్య పెళ్ళయిన కొత్తలో స్నేహితుల టీపార్టీలూ, పత్రికల పొగడ్తలూ ఉబ్బించి తబ్బిబ్బుచేశాయి. కాని అది చాలా కొద్దికాలం. తరువాత ఆమె తండ్రి కాపురం వేరే పెట్టించి అన్నయ్యని తన బ్రతుకు తనని బ్రతకమన్నాడు కన్న కూతుర్ని ఇంకొకరి భుజానవేసి.

అప్పట్నించీ అన్నయ్య జీవితమే మారి పోయింది. ఆ అమ్మాయిలో అందంతోపాటు సంస్కారంగూడా శూన్యమైపోయింది శుభ్రం తెలీదు చెబితే వినదు తనకి ఉద్యోగం దొరక లేదు తనకు స్నేహితులిచ్చిన టీపార్టీలూ, అభినందనలూ, పత్రికలు పొగడిన పొగడ్తలూ అన్నీ వట్టివని మాత్రమే నన్న విషయం అప్పటికవగాహనయింది కానీ ఇతరులదగ్గర పుట్టడం కష్టంగా వుంది. దానికితోడు ప్రకృతి ప్రసాదించిన మగబిడ్డ! ఒకనాడు తనను ఆకాశానికి ఎత్తిన స్నేహితులే- ఇప్పుడు తను కనపడితే ముఖం ప్రక్కకు త్రిప్పుకొంటున్నారు.

రోజులు గడిచినకొద్దీ ఆ అమ్మాయిలో లోపాలు తెలియసాగాయి. ఆమె భరించలేనంత అసహ్యంగా ప్రవర్తిస్తోంది. అన్నయ్య బ్రాహ్మడు. ఆమె క్రిష్టియను. ఆయనకీ-ఆమెకీ తిండిమొదలు కొని ప్రతిచిన్న విషయం వరకూ పొత్తుకుదరదు. తను బ్రతిమిలాడిచెప్పినా అర్థం చేసుకొనే సంస్కారం ఆమెలో లేదు. కొడితే వీధంతా పోగయ్యేటట్టుఏడుస్తుంది పెడబొబ్బలు పెడుతూ! ఏమిటి చేయడం? అన్నయ్య అప్పటికి తను చేసింది తప్పని విచారించాడు. కానీ లాభంలేకపోయింది.

నాన్న చనిపోయే సమయంలో గూడా అన్నయ్యని క్షమించలేకపోయాడు, "ఒక్క కానీ అయినా వాడికి ఇవ్వవద్దు-ఆఁ" అంటూ చెప్పి పోయాడు. అమ్మపోరు పడలేక అన్నయ్యను రమ్మని సగం భాగమిస్తాననీ ఉత్తరం రాశాను. కానిఆయనక్కడలేడు. ఎక్కడికో వెళ్ళిపోయాడు! ఆ దిగులుతోనే అమ్మ చనిపోయింది.

చాలాకాలం గడిచిపోయాక ఓనాడు కోర్టు వ్యవహారంమీద పట్నం వెళ్ళాను. బీచీలో ఇంచు మించు పిచ్చివాడి మాదిరిగా ఓ అబ్బాయి కని

పించాడు. ఆయన మా అన్నయ్యే! గుర్తు పట్టలేనంతగా మారిపోయాడు. సముద్రంవంక పిచ్చిగా చూస్తున్నాడు. ముఖంలో అభిజాత్యం చచ్చిపోయింది—ఒకనాడు ప్రస్ఫుటంగా కనిపించేది.

ఎక్కణ్ణించో ఉవ్వెత్తుగా వస్తున్న సముద్ర కెరటాల్లా నాలోంచి ఏడుపు పెల్లుబికి బయటికి వచ్చింది. తనుచేసింది పొరపాటని ఒప్పుకున్నాడు గాని ఆ పొరపాటు ఫలితం మాత్రం స్థిరంగా నిలిచిపోయింది. భార్య చనిపోయిందట. తను తాలూకాఫీసులో ఉద్యోగంచేస్తూ పిల్లాణ్ణిపెంచుతున్నాడట. "ఆ భారమంతా ఇక నామీదవదలి పెట్టు"మని కొడుకుతోసహా మా వూరు తీసుకెళ్ళాను. ఆయన ఇంకా ఎంతో కాల బ్రతకలేదు. కొడుకును నాకప్పజెప్పి చనిపోయాడు! ఆ అబ్బాయి బాధ్యత పూర్తిగా నామీదపడింది. తప్పుచేసింది తండ్రికాని దాని ఫలితం పూర్తిగా కొడుకు అనుభవిస్తున్నాడు. ఎంత ప్రయత్నం చేసినా సంబంధాలు ముందుకుతూగి రావడంలేదు. మధ్యపెట్టడానికి వీలుగా వుంటుందనే కుర్రాణ్ణి యం. బి. బి. ఎస్ చదివించాను. కానీ ఏమాత్రం లాభం కనిపించలేదు. చివరికి అబ్బాయే ఓరోజు "బాబాయ్! ఇక నా పెళ్ళిగురించి నువ్వు ప్రయత్నించడం అనవసరం బాబాయ్! నాకు తెలుసు బాబాయ్. ఎవ్వరు మాత్రం కులాన్ని ఎందుకు వదులుకుంటారు? నాన్న ఉద్వేగి కనుక అలా చేశాడు గాని, సంఘం ఒక్కరు ఇద్దరివల్ల మారుతుందనుకోవడం పొరపాటు బాబాయ్. సంఘములో సగంపైగా మారితే సంఘమంతా మారుతుంది. ఈ మధ్యకాలంలో కాలచక్రాల ఇరుసుల క్రింద నలిగిపోయి నాన్నలాంటివాళ్లు ఏదోచేద్దామని జీవితాన్ని నాశనం చేసుకుంటారు చివరికి.

నీకు కోపం రాకుండావుంటే ఒక్క విషయం బాబాయ్! మా స్నేహితుడి బంధువులమ్మాయిట చిన్నతనంలోనే భర్త చనిపోయాడట! పాపం ఆ అబ్బాయిని చూస్తే చాలా జాలివేసింది బాబాయ్! బ్రాహ్మలమ్మాయే! వితంతు శరణాలయంలో వుంది. ఆ అమ్మాయిని చేసుకుంటే ప్రపంచంలో ఓ హతభాగిని ఉద్ధరించినట్లున్నా అవుతుంది" అన్నాడు.

ప్రయత్నించి ప్రయత్నించి విసిగిపోయివున్న నాకూ ఈ విషయం కాస్త ఆశను కలిగించింది. వెళ్ళి నేనూ చూచాను. నువ్వు నమ్ము-నమ్మపో అలాటి అమ్మాయిని మన జీవితంలో మచ్చుకైనా చూచివుండ మనుకో! మనస్ఫూర్తిగా ఒప్పుకున్నాను. సంఘం ఏమైనా అటుందనే భయం, అంటే బాధ నాకేమీలేదు ఇంత కాలంవరకూ నీకేగాదు ఈ విషయం ఎవ్వరికీ తెలీదు! నే చేసిన పని ఎలా వుందంటావు?" అని ప్రశ్నించాడు నరేంద్రరావు.

ప్రవాహం ఇసుక తిన్నెదగ్గర రెండుగా చీలిపోతూంది? నరేంద్రరావు చెప్పిందాంట్లోనూ చేసిందాంట్లోనూ చాలావరకు సత్యం వుంది! సంఘాన్ని అతను లెక్కచెయ్యడు. కావాలంటే తనకున్న శక్తిని వినియోగించి తనకు బానిసగా చేసుకోగల స్థితిమంతుడు.

"నువ్వసలు పొరపాటు చెయ్యనని నా నమ్మకం" అన్నాను నేను. పది కళలతోనే ప్రవేశిస్తున్న చంద్రుడు వెలుగుల్ని ప్రసారితం చెయ్యడం మొదలెట్టాడు. యౌవనపు ముఖంలో వంపుసొంపుల్ని నదీజల్లాల్లో తొంగి చూచుకుని తన ఆనందానికి తనే బలిసిపోతున్నాడు.

"లేద్దామా?" అన్నాడు నరేంద్రరావు ఒకవేపు నించిలేస్తూ.

"సరేకానీ రేపు శరణాలయానికి వెళదామా?" అన్నాను నేనూ లేస్తూ.

"మరి నన్నెందుకు అంత తొందరగా రమ్మని రాశావనీ! నువ్వు చూడందే అసలు పెళ్ళి జరుగుతుందటోయ్!" అన్నాడు నరేంద్రరావు.

రెండో రోజు సాయంత్రంవరకూ ఏవేవో పనులు తెమలకుండా వున్నాయి. తీరిక చేసుకుని శరణాలయానికి బయలుదేరాము. నరేంద్రరావు అన్నయ్య కొడుకు చాలా ఉత్సాహవంతుడు. ఆధునిక భావాలు గలవాడే! నన్ను 'బాబాయ్' అంటూ పిలిచి ఉచితంగా గౌరవించాడు. దారిలో "బాబాయ్! మీ రెవరైనా ప్రేమించారా?" అని అడిగాడు. ఆ ప్రశ్న ఇప్పుడు-ఈ ప్రదేశంలో నన్నెందుకు వెయ్యాలో నా కర్థం కాలేదు. తడుముకున్నాను.

"ఆడవాళ్లు ప్రేమిస్తారా? మగవాళ్ళు ప్రేమిస్తారా బాబాయ్?" అన్నాడు మళ్ళీ.

"ఆడవాళ్ళు ప్రేమిస్తారు-మగవాళ్ళు ప్రేమనిస్తారు-కానీ వాటినిగురించి నాకొట్టే తెలియవు" అన్నాను నా దౌర్బల్యాన్ని బయలు పెడుతూ.

"శరణాలయంలో పిన్ని వుంది చూరావ్. ఆమె మగవాళ్ళే ప్రేమిస్తారంటుంది బాబాయ్. చాలా చక్కగా మాట్లాడుతుంది!" అన్నాడు. ఎదురుగుండా శరణాలయం వచ్చేసింది. బయటి నుంచి చూస్తోంటే భావుకుడి ఊహాప్రపంచంలా వుంది! చుట్టూ క్రోటన్సు వరసలు ఆగతులను ఆహ్వానిస్తున్నాయి. లోనికి ప్రవేశించాం! విశాలమైన తోట! శీతాశోకచిలుకలు వనవిహారం చేస్తున్నట్లుగా వివిధరకాలైన రంగుచీర్లతో చాలామంది తోటలో చెట్లకు నీళ్లుపోస్తున్నారు. కొందరు పాదులు పెడుతున్నారు.

"నమస్కారంపిన్నీ" అన్నాడు నరేంద్రరావు అన్నకొడుకు.

భూమి తవ్వుతున్నామె పలుగు అక్కడ పడేసి "నువ్వా? నమస్కారం బాబూ" అని రెండు క్షణాలసేపు నావంక చూచింది దీక్షగా.

"నువ్వా కృష్ణా! ఇందాకనించీ ఎవరోనని గుర్తుపట్టలేకుండా తికమక పడుతున్నాను. ఎంత ఇదిగా మారిపోయావు? అంతా కులాసాయేనా?" అంది.

నాకు తల గిరగిరా తిరిగిపోయింది. ఎవరీమె? ఒకచోట ఆగిపోయింది బుఱ్ఱ! ఎక్కడో చూచినట్టుగుర్తు! చిలిపిగానవ్వేకళ్లూ, లేడినిగుర్తుతెస్తున్న చూపులూ ఎక్కడో-ఎక్కడో గుర్తుకురావడం లేదు.

"నీకూ తెలుసాపిన్నీ వీరు?" అన్నాడు నరేంద్రరావు అన్నకొడుకు.

"తెలియడం ఒక్కటేకాదుబాబూ! ఆయనా మా అన్నయ్యా కలిసి చదువుకున్నారు. మావూళ్లోనే వున్నారు చాలాకాలం" అంది.

అప్రయత్నంగా నానోటివెంట "సావిత్రీ" అనేమాట వచ్చేసింది! సావిత్రి—ఒకనాడు నా హృదయాన్ని కలిచివేసిన సావిత్రి—ఎదురుగుండా నిలబడివుంది!

"ఏంకృష్ణా నాతో మాట్లాడ్డం ఇష్టంలేదా?" అంది మళ్ళా.

"అబ్బే! అదికాదు...(?)" ఏం సమాధానం ఇవ్వాలో తోచలేదు. సావిత్రిదగ్గర ఎప్పుడూ అంతే. ఒక్కసారి సమాధానానికి ఏమీ మిగలదు.

"పిన్నీ! వారు మా బాబాయికి ప్రాణస్నేహితులు. సరళను చూడ్డానికని వచ్చారు" అన్నాడు.

"ఈ జూకిగూడా టిక్కెట్టు పెడితే బాగుండును బాబూ జంతువుల్ని పోషించడానికి డబ్బు అయినా వచ్చేది" అంది నవ్వుతూ నరేంద్రరావూ కుర్రాడూ నవ్వుతూవుంటే నేనూ బలవంతానా నవ్వాను.

"మీరు భలేవారేనండి! టిక్కెట్టు విలువ చేసేంత చూడదగ్గ జంతువులు ఈ "జూ"లో లేవు గనకనే టిక్కెట్టు పెట్టలేదు" అంటూ నరేంద్రరావు అందుకొని చమత్కరించాడు. ఇంకోసారి అందరు ఫక్కున నవ్వాం.

సావిత్రిలో వయసుతోపాటు కళ్ళతో నవ్వుతున్నప్పుడు చిలిపితనం మరీ పెరిగిపోయింది. ముఖంలో ప్రతివంపూ గుర్తు చేసుకుంటోంది మనస్సు! ఉబికివస్తున్న రక్తాన్ని చూపించే చెక్కిళ్లు ఎదుటిమనిషి లోతుల్ని వెదికే కళ్ళు రెండు పర్వతాలమీదినుంచీ రెండు సెలయేళ్ళు ప్రవహించి ఒకచోట కలిసినదిగా మారి దిగువకు ప్రవహిస్తున్నకొద్దీ - దూరమైనకొద్దీ వెడల్పైన నదిలా వుండే ముక్కూ, మాట్లాడేప్పుడు విచిత్రంగా వణికే అధరం అన్నీ ఇప్పుడట్లాగే వున్నాయి. కాని సావిత్రి ప్రౌఢ అయింది.

"సరళా ఓ బొక్కెన నీళ్లు పట్టుకురామ్మా చేతులు కడుక్కోవాలి" అంది. మరుక్షణంలో నరేంద్రరావు చెప్పినమ్మాయి అక్షరాల్లా వచ్చి నిలబడింది సిగ్గుతో తలవంచుకుని. ఆ అమ్మాయిని చూచాక నరేంద్రరావుతో ఆత్మసంతృప్తికి అన్న మాటలు గట్టివేసనిపించింది. ఆ అమ్మాయి వెళ్ళిపోయిన తరువాత "ప్రపంచంలో ఆడజన్మంత నిరర్థకం ఏమీలేదు" అంది. ఆక్షణంలో సావిత్రి ముఖంలో భావం చూచిన ప్రతివాడూ తప్పకుండా ఆమెచెప్పింది ఒప్పుకోవాలి! కానీ మరుక్షణంలోనే "నువ్వు అదృష్టవంతుడివిలేబాబూ" అంది చిన్నగా నవ్వుతూ నరేంద్రరావు అన్నకొడుకుని. ఉత్తుంగ తరంగాలు పొంగినప్పుడు ఎంతశీఘ్రంగా నురుగువచ్చి, అంత క్షణికంగానే తగ్గిపోతుందో సావిత్రిలో ఏ భావమైనా అంత

క్షణికంగానేవచ్చి అంత క్షణికంగానూ మాయమై పోతుంది.

ప్రళయానంతరం ప్రశాంతం పొందిన ప్రపంచంలో చంద్రుడుదయిస్తున్నట్లు ఆమెముఖంమీద ఎర్ర కుంకుమబొట్టు వెడల్పుగా వుంది! పల్చటి శరీరంమీద చుక్కల జాకెట్టు నక్షత్ర భూషితమైన ఆకాశంలో మబ్బులు ఎత్తుపల్లాలుగా వ్యాపించినట్లుంది. సావిత్రి ముఖం వయస్సుని మింగేస్తోంది.

"కృష్ణా ఇప్పుడెక్కడ వుండడం?" అంది సావిత్రి.

"ఆఁ...అక్కడే, మా వూళ్ళోనే వుంటున్నాను" అన్నాను. ఇంతలో శరణాలయానికి యజమానికాదుగాని అధికారి అనుకుంటాను: వయసు మళ్ళింది.

"నరేంద్రరావుగారా! మా తోట చూస్తున్నారా ఏవండీ?" అన్నాడు వస్తూనే నవ్వుతూ!

"ఆఁఆఁ! అవునండీ! సాయంత్రంపూట ఈ ఈ ప్రదేశం మరీ అహ్లాదంగా వుంటుంది" అన్నాడు నరేంద్రరావు.

"లోపలికి వెళదాంరండి ఇక్కడే నిలబడ్డారే" అన్నాడు వృద్ధుడు.

"వచ్చి చాలాసేపయింది! మా మిత్రుడు శరణాలయం చూస్తానంటే తీసుకొచ్చాను-ఆఁ పద కృష్ణా-త్వరగా వెళ్ళాలి. ఇంకా చాలా పనులున్నాయి" అన్నాడు నరేంద్రరావు.

"వుంటాం పిన్నీ" అన్నాడు నరేంద్రరావు అన్నకొడుకు.

"మంచిది బాబూ! తీరికవుంటే రేపొకసారి రండి!" అంది సావిత్రి నావంక చూస్తూ. ఇంటికి బయలుదేరేసరికి ప్రొద్దు గూకింది.

పరాక్రమవంతుడైన పుత్రుణ్ణి పోగొట్టుకుని మూలుగుతూన్న ప్రపంచానికి చల్లని చుక్కల రాజు దయించి దుఃఖోపశమనం కలిగించాడు.

* * *

ఆరోజు ఆదివారం. పత్రికలు చదువుకొంటూ రూమ్‌లో పండుకున్నాను. శ్రీనివాసరావు సీరియస్‌గా గదిలోకి వచ్చాడు. అతనూ నేనూ రూం మేట్సుమి.

"రారా! కూర్చో. ఏమిటీ ఇవ్వాళ ఆముదం తాగావా?" అన్నాను సహజంగా వేళాకోళం ఆడుతూ.

"మ్చ్!" పెదవి విరిచాడు.

"పోనీలే బ్రతికించావు, ముఖంచూచి షేక్స్పియరు మళ్ళా నీలో ఆవహించాడేమో అనుకున్నాను" అన్నాను.

"నీతో మాట్లాడాలి!" అన్నాడు శ్రీనివాసరావు. అంత నిక్కచ్చిగా మాట్లాడ్డం అదే మొదటిసారి.

"ఏవిటది?" అన్నాను చదివిన పేజీని గుర్తుపెట్టుకోడానికి వేలు లోపలపెట్టి మూసిన పుస్తకాన్ని అవతల గిరాటేసి.

"కృష్ణా! నువ్వు..." చెప్పలేకపోతున్నాడు.

"ఏవిట్రా-నేనేవిటి?" అన్నాను ఆత్రంగా.

"నాకోసం అంత త్యాగం చెయ్యగలవనుకుంటాను" అన్నాడు.

"అసలు చెప్పకుండా..."

"చేతిలో చెయ్యివెయ్యి-చేస్తానని."

"ఎట్లావెయ్యను? త్వరగాచెప్పు-తరువాత..."

"నువ్వు దీన్ని వేళాకోళంగా తీసుకోకు. నే చెప్పబోయేది నీ జీవితసమస్య కావచ్చు! కానీ నువ్వు దాన్ని నిరాకరించవని మనిద్దరి గాఢస్నేహాన్ని పురస్కరించుకొని అడుగుతున్నాను. మా చెల్లెలు సావిత్రి నీకూ తెలుసుగా? మొన్న ఓ సంబంధం కాకినాడనించి వచ్చిందని నీకు చెప్పాను. నాన్న సావిత్రి ఇష్టాన్ని గురించి అడిగాడు" క్షణంసేపు ఆగాడు.

నే చెయ్యవలసిన త్యాగానికీ వాళ్లనాన్న సావిత్రిని పెళ్ళి విషయం గట్టిగా అడగడానికీ గల సంబంధం నాకేవిధంగా ఆలోచించినా కించిత్తయినా అంతుపట్టలేదు. అదే ఇంకా ఆలోచిస్తున్నాను. ఇంతలో

"నా కిష్టంలేదని చెప్పింది" అన్నాడు శ్రీనివాసరావు.

"ఆఁ..."

"ఇంకొకటికూడా చెప్పింది"

"ఏమిటది?"

"తను నిన్నే చేసుకుంటానంది. ఇంకెవర్నైనా తను పెళ్ళి చేసుకోదట!" అన్నాడు శ్రీనివాసరావు నేలవంక చూస్తూ.

నాకు క్షణంసేపు సుషుప్తావస్థేమోనని అనుమానం వేసింది. జీవితంలో అంత అకస్మాత్తుగా అంతటి విషయాల్ని వినడం అదే మొదటిసారి.

"నువ్వేమంటావు?" అని అడిగాడు శ్రీనివాసరావు కొన్ని క్షణాలు గడిచిన తరువాత.

"నాకుచాలా టైముకావాలి. ఆలోచించాలి. నువ్వెళ్ళు-నాకు ఏకాంతం కావాలి" అన్నాను.

"ఇంత హఠాత్తుగా చెప్పడంవల్ల మనిషి ఎలా మారతాడో నాకు తెలుసు. కానీ మానాన్న నిన్నడిగి చూడమన్నాడు. అప్పటికైనా అడిగి వుండేవాణ్ణికాదు. కాని మనిద్దరి స్నేహానికీవున్న విలువతక్కువదికాదనేధైర్యంతోఅడుగుతున్నా"

"సరే! ఆలోచించి చెప్తానన్నాగా."

"అయితే నే వెళ్లొస్తా! సాయంత్రం..."

"ఆఁ ఆఁ అలాగేలే! వెళ్లు..."అన్నాను.

మబ్బులేకుండాపడిన పిడుగ్గి అయోమయమైపోయింది. సావిత్రిని నే నెప్పుడూ ఆ దృష్టితో చూళ్లేదే! జీవితాన్ని ఓ స్త్రీకి దాస్యంచేస్తూ గడపడం నా ఆశయానికి కేవలం వ్యతిరేకమైంది.

సావిత్రిని ఏకోణంలోంచి చూచినా ఎందుకు చేసుకోవాలో ఆధారాలు దొరకలేదు. ఆకారం సమ్మోహింపచేసేంత రూపంగాగూడా వుండదు! సావిత్రి అందాన్ని గురించీ—వాటిని గురించి విశేషించి చెప్పవలసినవి ఏమాత్రమూ లేవు. సామాన్యస్త్రీకంటె చెప్పుకోదగ్గ విశేషాలేమీ లేవు. అందమైన ఆడవాళ్ళల్లో లెక్కించదగ్గమనిషిగూడా కాదు సావిత్రి. మరి? ఎందుకు చేసుకోవాలి? ఏనాడూ నేనామెనుచూచి ముగ్ధుణ్ణికాలేదు. స్నేహితుడిచెల్లెల్ని సామాన్యంగా ఎలాచూస్తామో ఆమెనూ అదేదృష్టితో చూచాను. ఆమెకళ్ళలోని చిలిపితనం నాకు మాడబుద్ధివేసేది. అంతే సావిత్రి కళ్ళుతప్ప ఆమెలో ఎంత వెతికినా ఏ ఆకర్షణా కనిపించలేదు. ఆమెను చేసుకొని సంఘుచ్యుతుణ్ణై జీవితం ప్రపంచోద్ధరణకు అంకితంచేసే ఓపిక నాలోలేదు.

రాత్రల్లా నిద్రలేకుండా ఆలోచించినా తెగని సమస్యను రెండోరోజుగూడా బుర్రచించుకొని ఆలోచించడం మొదలు పెట్టాను. ఈ సమస్య విషమంగా అయిపోయి కూర్చుంది.

మావూరినుంచి టెలిగ్రాం వచ్చింది అమ్మకు సీరియస్‌గా వుందని - త్వరగా రమ్మని! ఆలోచనలు అప్రయత్నంగానే కట్టుపడింది. బండెక్కాను.

అమ్మ దురదృష్టవశాత్తూ ఈలోక బాంధవ్యాన్ని త్రెంచుకొని నాన్నను చేరింది. ఆ దిగులుతోనూ-సావిత్రి సమస్యతో అవూర్లో అడుగుపెట్టే ధైర్యంలేకా మళ్ళా అవూరు వెళ్ళలేదు. నాగురించి విచారించేవాళ్లెవరూ లేరు. ఆస్థివుంది గనక వచ్చిన చుట్టాలు వివాహం చేసుకోమని ఉచితంగా సలహాలిచ్చిపోయారు. కొందరు తమ పిల్లల్నిస్తామని గూడా ముందుకు తూగారు. కాని నాలో వివాహవాంఛలేదు. ఇక వివాహం చేసుకోగూడదనే నిశ్చయం ధృఢమైపోయింది.

తుమ్మెద తోటంతా మోతపెడుతోంది పువ్వుపువ్వూనూ తిరుగుతూ. "దానికీ నాకూ చాలా పోలికలున్నాయి" అనిపించిందినాకు. ఒక్కనిమిషం గడిచిన భ్రమరజీవితం నా కళ్లెదుట మెరిసింది.

సావిత్రి అనేది "మగాళ్ళకు తాము ప్రేమిస్తున్నామనే విషయం తెలీదు. కాని ఆ విషయం ఆడవాళ్ళకు తెలుస్తుం"దని. నేను నాజీవితంలో ఎవరైన్నా ప్రేమించానా?"అని ప్రశ్న వేసుకున్నాను. ఏమో సావిత్రి అన్నట్లు ప్రేమించానేమో-నాకు తెలీకుండానే!

* * *

ఆ సావిత్రి మళ్లీ ఈనాడు కనిపించింది. అప్పటి సావిత్రినీ ఇప్పటి సావిత్రినీ ఒకరిప్రక్క ఇంకొకర్ని నిలబెట్టి చూచాను. సామ్యాలెన్నున్నాయో భేదాలుగూడా అన్ని వున్నాయి. అప్పటి సావిత్రి అనుభవాలులేక అమాయకంగా వుంది. కాని ఇప్పుడు జీవితాన్ని అర్థంచేసుకొని వయస్సుతోపాటు మనస్సుగూడా ప్రౌఢత్వం చెందింది. అప్పుడున్నన్ని ఆశలు ఆమె ముఖంలో ఇప్పుడు లేవు.

కళ్లైలేని కాలం పరిగెత్తి ఉషస్సును తెచ్చింది. పెళ్ళిపనుల్లో సావిత్రిని గురించి ఆలోచించే అవధి లేకపోయింది. ఆమె కోరినట్లు వెళ్ళి పెళ్లిలోపుగా కలుసుకోలేకపోయాను.

వివాహం శరణాలయ వివాహ మంటపంలోనే జరపడానికి నిశ్చయింపబడింది.

నాలుగక్షతలూ వధూవరులమైన వేసి పందిట్లో గాలి ఆడకపోవడంమూలాన, పెళ్ళిపనులు చేసి చేసి వళ్ళు అలిసిపోయి చల్లగాలిని కోరుతూ వుండడంవల్ల తోటలోకినడిచాను.పడమటిదిక్కున ఓ చుక్క "నీకోసమే ఈ గుక్కెడు ప్రాణాలు నిలుపుకున్నాను. ఈ నా చిన్ని వెలుగు ఏక్షణాన ఆరిపోతుందో. త్వరగా రా!"అంటూ చంద్రుడి వంకే కళ్ళను కేంద్రీకరించి మిణుకు మిణుకు మంటోంది. ప్రేయసిని చేరుకోడానికి చంద్రుడు రొప్పుతూ పరిగెత్తుతున్నాడు మొయిళ్ళు కలుగ చేసే విఘ్నాల్ని దాటుకొంటూ!

మల్లెపందిర దగ్గర నిలబడి సావిత్రి పూలు కోస్తోంది. ఎర్రరంగు చీర కట్టుకుంది. కాని చంద్రుడి కాంతి ప్రతిఫలిస్తూ కలనేతరంగు చీరలా కనిపిస్తోంది ఎర్ర సిల్కు! కోరా రంగు ఖద్దరు జాకెట్టు వేసుకుంది.

"రా కృష్ణా! నిజంగా మనిషికి భావాలు బయల్పరిచేందుకు సాధనే లేకపోతే చనిపోయే వాడు కదూ!"అంది.

"నిజమే! అవ్యక్త ఆనందంతో నిండిపోయి గుండె ఆగిపోయేది" అన్నాను పైన వెన్నెల, ప్రక్క మలయమారుతాన్ని నెమరేసుకొంటూ.

"పూలు ఇప్పుడు కోస్తున్నావేం?" అన్నాను అది అసహజం గనుక.

"మా చెలికత్తెకు చెట్టునవిచ్చిన పూలహారమే బహుమతి ఇవ్వాలని! సరేగాని ఇద్దర్నీ ఏమని దీవించావు?"అంది.

"సావిత్రీ! ఆశీర్వచనంలో అమంగళం వుండ దుగా?" అన్నాను.

"అవుననుకో! 'పుత్ర పౌత్రాభివృద్ధిరస్తు'అనా 'ధనం, ధాన్యం'అనా నువ్వు దీవించింది?"అంది నవ్వుతూ.

"తిండిలేక మాడిపోతున్న ఈరోజుల్లో పుత్ర పౌత్రాభివృద్ధిరస్తయితే మూడో ప్రపంచ యుద్ధం తథ్యం! 'ధనం, ధాన్యం' అన్నాను"

"నువ్వు చాలా కొదిగా మారావు కృష్ణా!" అంది సావిత్రి.

సావిత్రి ఆ మాట నాకెక్కడ తగలాలని ప్రయోగించిందో సరిగ్గా అక్కడే తగిలింది.

"నిన్నిక్కడ చూస్తానని నేనెప్పుడూ అనుకో లేదు సావిత్రీ!"అన్నాను.

"దాంట్లో విశేషమేముంది? ఇంకో క్షణానికి మనిద్దరం ఏమైపోతామో ఇప్పుడనుకోగలమూ?" అంది స్వాభావికంగానే.

"నినో్క విషయం అడగనా?" అన్నాను.

"అడుగు కృష్ణా! ఇష్టమయితే చెపుతాను. అంతేగా మరి! మానవులు తమ కిష్టమైన పను లేగా చేసేది?" అంది - ఒకనాడు నాన్న రౌదుకు భయంలేకుండా అమాయకవదనంతో ప్రపం చాన్ని తెలుసుకోకుండా "నేను కృష్ణమూర్తినే చేసుకుంటాను" అని తెగేసి చెప్పిన సావిత్రికీ- ఈ రోజు మానవచేష్టితాలకు మూలాన్ని నిర్వచించిన సావిత్రికీ ఎన్నో అంతరాలభేదం కనిపించింది నా కాక్షణాన.

"నువ్వు శరణాలయానికి...(?)"

"ఎందుకొచ్చావు అంటావు" నా ప్రశ్న పూర్తవకముందే అందుకుంది "శరణాలయాలకు మనుషులు ఎందుకొస్తారోగూడా నీకు తెలీదని నే ననుకోను" అంది వ్యంగ్యంగా. ఆ వ్యంగ్యం ఎదుటివారికి తెలియనంత నిగూఢంగాలేదు.

"అయితే నీకు పెళ్ళి..."

"ఆఁ ఆఁ అన్నీ అయిపోయాయి"సహజంగా అనేసింది.

"అప్పుడే?"

"దానికి సమయం కావాలంటావా?" అని అడిగింది. ప్రశ్న నాకు వెయ్యిసమ్మెటలు పెట్టి వేస్తున్నట్లుగా వుంది.

"మరి నువ్వసలు పెళ్ళే చేసుకోనన్నావుట?"

"అంటే మాత్రం వినేదెవరు చెప్పండి? తమ కర్తవ్యం ప్రకారం పెళ్ళి చేసేశారు..." అంది.

వేడిగా నిట్టూర్చాను.

"కాని నేనాయన్ని ప్రేమించలేకపోయాను. ఆయన నాకోసంచేసే ప్రయత్నాలుచూచి జాలి పడేదాన్ని. కాని ఏంచెయ్యను...? కొంతకాలా నికి ప్రేమించటానికి ప్రయత్నం చెయ్యడం మొదలు పెట్టాను. కాని సఫలం అయింది నా ప్రయత్నం అని చెప్పలేను. అయ్యేదాన్నేమో? కానీ..." చెప్పడం ఆపేసి గబగబా అక్కణ్ణించి వెళ్ళిపోయింది.

నిర్జీవప్రతిమలా సావిత్రివంకే చూస్తూ కూర్చుండిపోయాను. ఆ సమయంలో ఏ యముడన్నా వచ్చి మృత్యుపాశం ప్రయోగించకూడదా? అనుకున్నాను. దనంతటికీ కారణం కేవలం నే వెనకీ బాధలోపల్నుంచి పైకిరావడానికి సాధనం వెతుకుతోంది.

ప్రపంచంలో పుట్టింతరువాత కేవలం స్వార్థానికే జీవితాన్ని అంకితంచేస్తే అది రాక్షసత్వానికి దిగజారిపోయినట్లవుతుంది? తను-తనసుఖం... కేవలం తనేనా ప్రపంచమంతా సావిత్ర జీవితాన్ని పోతపోసిన వ్యక్తిని నేనేనని నిస్సంశయంగా తేలిపోయింది. దానికి పరలోకమంటూవుంటే భగవంతుడు ఏశిక్ష విధిస్తాడో మరి!

మిగిలిన రాత్రికూడా అక్కణ్ణించి కదలదలుచుకోలేను. ఏకాంతంగా కుమిలి పోతేనన్నా కొంతభారం తగ్గిపోతుందేమోనని మానవ సహజమైన ఆశ! ఇసుకదిబ్బమీద అలాగే కూర్చుండిపోయాను.

పెళ్ళి మండపంలో హడావుడి తగ్గిపోయింది. నడిఝామువరకూ మానవకల్పితారావాలు వినిపిస్తూనే వున్నాయి! కాలాతీతమైన కొద్దీ సద్దుమణిగిపోతోంది వాతావరణం

"నువ్వింకా ఇక్కడేవున్నావా" అంది వెనకనించి సావిత్రి.

"ఆఁ" అలాగే చూస్తూ సమాధాన మిచ్చాను.

"చాలా ప్రొద్దుపోయింది."

"పరవాలేదు-అలాకూర్చో సావిత్రీ"అన్నాను.

ఇసుక దిబ్బమీదే రెండుమూడు గజాలు నాకు దూరంగా కూర్చుంది! సావిత్రి చీర మార్చింది. తెల్లచీరమీద నల్లజాకెట్టు వేసింది. సావిత్రిలో యవ్వనం ఇంకా అట్లాగే నిలిచిపోయి వుంది. అజంతా గుహల్లో శిల్పిచెక్కిన విశాలవక్షంలాటి సావిత్రి వక్షస్థలం ఆమె వయస్సును దాచేస్తోంది.

"మీ అన్నయ్య ఎక్కడున్నాడిప్పుడు?" ఏం మాట్లాడాలో తోచక అడిగాను.

"రైల్వేలో ఉద్యోగం నిస్తున్నాడు" అంది.

"మరి శరణాలయంలో ఉండాల్సిన అవసరం?" అని అడిగాను.

"మానవుల్లోనూ - వాళ్ళ మమకారాల్లోనూ నాకు నమ్మకంపోయింది క్రిష్ణా! పెళ్ళికాకముందు నాకు ఇంట్లోవున్న, గౌరవం విశ్వస్తగా ఇంట్లో చేరాక చెప్పలేనంతనీచంగా మారిపోయాయి. పనిమనిషిగా చూచినా నాకేమీ బాధకలిగేదిగాదు. అంతకంటే కూడా నీచంగా చూడడం మొదలుపెట్టాడు అన్నయ్య. అంత బాధ్యతగల నాన్నకూడా అన్నయ్యనెప్పుడూ మందలించలేదు! ఇంకా మానవుల్లో ప్రేమ, ఆత్మీయత ఎక్కడున్నాయో కాస్త ఆలోచించు"అంది. ఆలోచించాను. సావిత్రి నగ్నసత్యాన్ని తరచి చెపుతోంది.

"నిజంసావిత్రీ! నీకు మానవజాతిపైన నమ్మకంపోవడంలో ఆశ్చర్యం, ఏమీలేదు. కాని అలా అనుకుంటే మనుషులు బ్రతకలేరు!" అన్నాను ఆమెను ఒప్పుకుంటూ.

"నువ్వు చెప్పింది బాగానేవుంది. కానీ... ఆశ ఖరీదు చాలా తక్కువ కృష్ణా! మానవ జీవితంలో ప్రతిక్షణం బ్రతుకువైపుకే ముల్లు చూపుతూంటుంది! ప్రతి నిమిషం ఆశ బ్రతుకువేపు బరువు వేస్తూనే వుంటుంది." అంది.

"నువ్వు మీ అన్నయ్యని ద్వేషిస్తావా?" అన్నాను ఆమెను సరిగా అర్థం చేసుకోలేక.

"అవుసరంలేదు! తన విషయం వచ్చేసరికి ప్రేమలవిలువ లేమీవుండదు కృష్ణా! తనను తాను ప్రేమించుకున్నట్లు ఎవరైనా ఇంకొకర్ని ప్రేమించగలరా? స్వార్థం వచ్చేసరికి అన్నయ్యేగాదు. అందరూ అంతే! అది ప్రకృతిలక్షణం" అంది.

"మరి నువ్వు ద్వేషించేదిఏటిని? సంఘాన్నా?" అన్నాను.

"నేను ప్రకృతినీ-సంఘాన్నీ ఒప్పుకుటాను. కానీ కృతకమైన సాంఘిక నియమాలలో ఇమిడివున్న ధ్వనినిమాత్రం నే నొప్పుకోను. దానివల్ల సంఘానికి ఆపాదింపబడే నీచత్వాన్ని ఎదుర్కోడానికి నాకు శక్తిలేదు. నే నోరింః లేనన్న విషయం నాకు తెలుసు. అందుకే సంఘానికి తలవంచుతాను" అంది.

చంద్రుడు అలిసిపోయి ఎర్రబడ్డాడు. భూమిమీద ఆడుకొంటున్న చంద్రకళలన్నీ ఒక్కొక్కటే అతనిలోకి వెళ్ళి లీనమై పోతున్నాయి. దోషపూరిత నేత్రాలతో కందిపోయినచంద్రుడు

నావంక తీక్షణంగా చూచాడు. నాలో చలనం కలిగింది!

"సావిత్రీ-" అన్నాను.

"ఆఁ" కంచువరల్లోంచివచ్చిన కంఠంలావుంది.

"నిన్నో విషయం అడగాలనివుంది" అన్నాను.

"ఇంకా మనిద్దరిమధ్యా అఘాతాలెందుకు కృష్ణా! అడుగు" అంది.

"ప్రేమనూ దాని స్వార్థాన్నీ నా జీవితంలో ఎప్పుడూ అర్థంచేసుకోలేదు. అవి క్షణికమైన ఆవేశాలనీ-వాటికి నిర్దిష్టమైన విలువల్లేవనీ ఈక్షణం వరకూ నమ్ముతూ వచ్చాను...అవన్నీ ఇప్పుడెందుకులే! నన్ను క్షమించగలవా?" అన్నాను.

సావిత్రి మందహాసం చేసింది కాని అది చెట్టుమీదినుంచి రాలిపోతున్న పువ్వు నవ్వినట్లు గానే వుంది.

"దీంట్లో ఒకర్నొకరు క్షమించుకోవడంతప్ప కేవలం ఒకరు ఇంకొర్ని క్షమించడానికి అవకాశంలేదు కృష్ణా! రెండుక్షమార్పణలూ కొట్టేస్తే సరిపోతుంది" అంది.

"అదెలా?" అన్నాను.

"నువ్వు పెళ్లెందుకు చేసుకోలేదు?" అకస్మాత్తుగా సావిత్రి ప్రశ్నించి ది. సావిత్రి ఎంత తేలిగ్గా ఆ ప్రశ్న వేసిందో సమాధానం మాత్రం అంత సులభమైందికాదు. ఏమీ తోచక నిరుత్తరుణ్ణయాను.

"నాకు తెలుసు కృష్ణా!" అంది.

నేను ఆశ్చర్యపోయాను. నాకేవిధంగానూ నమ్మకంలేదు.

"ఏమిటో చెప్పు" అన్నాను.

"చెప్పనా? నువ్వు నాకోసం పెళ్ళిచేసుకోలేదు. ఇంత కాలం నాకోసమే నిరీక్షిస్తున్నావు. అంతే కృష్ణా అంతే! ఇక దీంట్లో ఎవ్వరూ క్షమించ నవసరంలేదు!" అంది.

సావిత్రిని అప్పటివరకూ అర్థం చేసుకోలేకపోయాను. ఆమె నెప్పటికైనా అర్థంచేసుకోగలననే పూర్తి విశ్వాసం నాలో ఇప్పటికీ లేదు. కాని సావిత్రి నన్నూ-ప్రకృతినీ-దాని ప్రభావాన్నీ ప్రకృతి నాపైన ప్రసరింపజేసిన ప్రభావాన్నీ క్షుణ్ణంగా అర్థంచేసుకుంది ఎంతో కాలం నుంచి నాలో అవ్యక్తంగా వున్న భావాన్ని ఈనాడు సావిత్రి బయటికి తీసి విప్పి చెప్పింది. నా కళ్ళవెంట అప్రయత్నంగా నీళ్లు తిరిగాయి.

సావిత్రి మళ్ళీ అంది "ఈ క్షణంతో జీవితంలో వున్న శంకలన్నీ నివృత్తి అయిపోయాయి కృష్ణా! మనిద్దరిమధ్యా ఏ విధమైన కల్మషం లేకుండా జీవిత సింహావలోకన చేసుకొని కలుషిత పదార్థం ఏదైనా వుంటే ఈనాడే కడిగేశాం! ఇక వస్తాను" లేచి నిలబడింది "రేపట్నుంచీ నేనిక్కడ కనిపించకపోతే ఆశ్చర్యపడకు...వుంటా" సావిత్రి వెళ్ళిపోయింది.

చంద్రుణ్ణి పూర్తిగా మబ్బులు కప్పేసేసరికి ఓ క్షణం లోకంతా గాఢతిమిర పరివ్యాప్తమైపోయింది. సావిత్రి తెల్లగామాత్రం కనిపించింది నాలోనించి ఏదో వెలుగు లేచి వెళ్లిపోతున్నట్లు ఎదురుగా.

సావిత్రి వయస్సుకూ నా వయస్సుకూపోలిస్తే నిజానికి సావిత్రి నాకంటే చాలా చిన్నది. కాని ఆమె జీవితాన్ని అర్థం చేసుకున్నంతగా నేను అర్థం చేసుకోలేకపోయాను. సావిత్రిలో మానవత్వం పరిపూర్ణత చెందింది. మానవ జీవితం ఆమెలో కైవల్యాన్ని పొందింది. ఆమెను నేనెన్నటికీ మర్చిపోలేను. నన్నినాటికీ సావిత్రి ఎందుకింత ఆత్మీయంగా పిలిచిందో తెలీదు.

సావిత్రి కొన్ని నగ్నసత్యాలను కనుక్కుంది. "మొగాళ్ళు ప్రేమిస్తారు ఆడేవాళ్లు ఆ ప్రేమని అందజేస్తారు. కాని మొగాళ్ళకు తాము ప్రేమిస్తున్నామన్న విషయం తెలీదు" అంది.

జీవితంలో నిరాశావాదానికి తావులేదంది. ఆశ ఖరీదు చాలా చౌకనికూడా చెప్పింది. సంఘాన్ని ఒప్పుకుంటుంది సావిత్రి. కాని సాంఘిక నియమాలు అలా వుండగూడదంటుంది. సావిత్రి చెప్పినవన్నీ తప్పకుండా ఒప్పుకోవాల్సిందే. సావిత్రిదగ్గర కొంత కాలం శిష్యరికంచేసి శిక్షపొంది నా అకృతాత్మను హరింపజేయాలని నా కోరిక. కానీ ఆమె ఆకాశ కుసుమం! నా కళ్ళవెంట నీళ్లు కారుతూన్నాయని నాకు చాలా సేపటిగ్గాని తెలియలేదు.